# మాయదారి సంబంధం

"చూడు విశాలీ ఆ డాన్సుచేసే అమ్మాయి మన సీమలాలేదూ? నేను చాలా సేపటినుంచీ చూస్తున్నా ఆ అమ్మాయి ప్రతికదలికలోనూ సీమ కనబడుతోంది. నీవు బాగా చూడు." అన్నాడు భీష్మనారాయణశర్మ. ఆయనకు ఉదయంలేచి స్నానంచేసి, పేపరు చేతబట్టుకుని మరోచేత్తో కాఫీ తాగటం అలవాటు. మంచి ప్రోగ్రాములు టి. వీ. లో వచ్చినప్పుడు చూడమని భార్యను పిలవటం ఇంకొక అలవాటు. తన సంతోషాన్ని ఆమెకూడా పంచుకోవాలని ఆరాటపడటం మరొక అలవాటు.

"మీకు ఎవరినిచూసినా సీమను చూసినట్టే ఉంటుంది. అది వెళ్ళి ఐదేళ్ళు దాటింది. ఒక్క ఉత్తరంరాసిందా? అక్కడున్నవాళ్ళు మాటిమాటికీ టెలిఫోను చేస్తారట కాని-ఉత్తరాలు రాయరట. పోనీ అదయినా చేసిందాలేదు మీరు మీ వ్యాపారాన్ని, అమ్మాయివెళ్ళి, కొంతకాలం నెలకొన్న తరువాత-అక్కడకూడా మొదలుపెడతానన్నారు. ఏదీ-అక్కడినుంచి ఎడ్రసుగాని ఫోను నెంబరుగానీ వస్తేకదా? ఏమిటో-రాత్రిపగలూ అదే కళ్ళల్లో నిలిచినట్టుంటుంది" కళ్ళు ఒత్తుకుందామె.

"ఇంతకూ నేనడిగింది నీవు చెప్పనేలేదు. ఆ అమ్మాయి మన సీమ అని నాకు బాగా నమ్మకంగాఉంది."

"అది కేవలం మీ భ్రమ"

"నువ్వేమన్నా అను. నేనివాళే టి.వి.వాళ్ళకు ఉత్తరంరాస్తాను ఆమె వివరాలు కావాలనీ, ఎడ్రసురాయమనీను" అంటూనే కలం పేడ్ అందుకున్నాడు.

"అందరూ నవ్వుతారు. ఆ పనిమాత్రం చెయ్యకండి" ఆమె అంటూ ఉండగానే ఆయన టీ. వీ. అధికారులకు ఉత్తరంరాశాడు అర్జంటుగా జవాబు రాయమని.

వాళ్ళదగ్గర్నుంచి నాలుగోనాటికి జవాబువచ్చింది. ఆ ప్రోగ్రామ్ మదరాసు నుంచి రిలేచేశారని, ఆయన అంతటితో ఆగలేదు. వెంటనే ఒక సూట్‌కేసులో అవసరమైన బట్టలు సర్దుకుని "నేను మదరాసు వెళ్తున్నా"నని కారులో స్టేషన్‌కి బయలుదేరాడు. వెళ్ళగానే మదరాసుబండి వెళ్ళిపోయిందని తెలిసింది. "మీరు కారులో కాజీపేట వెళ్ళితే ఆబండి దొరుకుతుందన్నారు" అక్కడ నిలబడ్డవాళ్ళు. విమానంలో వెళ్ళాలనుకుంటే అది ఎప్పుడో వెళ్ళిపోయింది. పదిగంటలకు ఏబండీ ఉంటుంది కనుక మదరాసు వెళ్ళటానికి?

కారునిండా పెట్రోలు పోయించుకుని డ్రైవరుతో కాజీపేటకు పోనివ్వమన్నాడు. ఆయన ఆలోచనలు అంతకంటెముందుగా పరుగెత్తుతున్నాయి సీమ - సీమ అది సీమేనంటూ.

కాజీపేట వెళ్లేసరికి రైలు కూతవేసింది. ఎనౌన్సుమెంటు అయింది. టికెట్ కొనే వ్యవధిలేదు చెకింగ్‌కి వచ్చినప్పుడు టి.సి.కి చెప్పవచ్చుననుకుని మొదటి తరగతి కంపార్టుమెంటులోకి ఎక్కాడు ఆయన కూర్చునేలోపల బండి బయలు దేరింది.

డ్రైవరు ఇంటికివెళ్ళి జరిగినదంతా చెప్పాడు.

"అయ్యగారికి ఎప్పుడూ అమ్మాయిధ్యాసతప్ప మరేంలేదు ఈ మధ్య. వెళ్ళి మదరాసంతా గాలించనీ, మనం పంపించిందేమో అమ్మాయిని అమెరికాకు. ఈయన మదరాసులో వెతుకుతారట!" విరక్తిగా అన్నది విశాలమ్మ నవ్వుతూ.

భీష్మనారాయణవర్మ ఎక్కిన రైలు తెల్లవారి ఏడుగంటలకు మదరాసు చేరుకుంది ఆయన మదరాసులో పుట్టి పెరిగినవాడు అంతాతెలుసు. హోటల్లోదిగి స్నానంచేసి కాఫీ టిఫిన్ తీసుకుని టి. వీ. స్టేషన్‌కి వెళ్ళాడు ఆ రికార్డునుగురించి విచారించగా ఇంకా అందరూ రాలేదని నౌకర్లుచెప్పారు. వచ్చేవరకూ కళ్ళు మూసుకుని ఆలోచిస్తూ కుర్చీలో కూర్చున్నాడు. కొంతసేపటికి ఒక్కొక్కరే రావడం మొదలుపెట్టారు. పావుగంట తరువాత రికార్డునుగురించి చెప్పే ఆయన వచ్చాడు,

"ఆమె ఇక్కడేఉంటుంది. అది రికార్డుకాదు లైవ్ ప్రోగ్రామ్" అన్నాడు అధికారి.

''ఆమె పేరు?''

''సీమంతిని''

''ఎడ్రసు?" ఆయన ముఖం వికసించింది.

"మాంబళంలో మొదటివీధి. ఏడవ నెంబరు ఇల్లు రామానుజం అయ్యంగార్ ఇంట్లో మేడమీద ఉంటుంది. వారే స్వయంగా తీసుకువచ్చారు ఇక్కడికి" అన్నాడు.

భీష్మనారాయణవర్మ సంతోషాతిరేకంలో అట్టిపెట్టుకున్న టాక్సీని మాంబళం పరుగెత్తించాడు. రామానుజంఅయ్యంగారింటి మేడమీదికి తిన్నగావెళ్ళి గంట కొట్టాడు.

ఒక అమ్మాయివచ్చి తలుపు తీసింది.

"సీమంతిని ఉన్నదా?" అడిగాడు ఆతురతతో.

"నాన్నా! అంటూ సీమంతిని గదిలోనుంచివచ్చి ఆయన కంఠానికి చేతులు పెనవేసి వెక్కి వెక్కి ఏడ్చింది.

కొంత సేపటికి కళ్ళు తుడుచుకుని ఆయన నొక కుర్చీలో కూర్చోబెట్టి, మంచినీళ్ళిచ్చి "నేనిక్కడున్నానని ఎవరుచెప్పారు నాన్నా?" అడిగింది ఆయన కాళ్ళదగ్గరకూర్చుని

"నీవిప్పుడు ఎక్కడికి వెళ్ళాలని డ్రెస్‌చేసుకున్నావు?" ప్రశ్నించాడు.

"నేను చిన్నప్పుడు డాన్సు నేర్చుకుంటుంటే నీవు 'డాన్సు మనకెందుకు' అని చికాకుపడేవాడివి. సంగీతమంటే ఇష్టపడేవాడివి. ఆ డాన్సే నాకు జీవనాధారమయింది. నేను డాన్సు క్లాసులు తీసుకుంటున్నాను. పక్కసందులో ఒకగది అద్దెకు తీసుకుని పదిమందికి చెప్తున్నాను."

"నీవు రెండురోజులు రాలేనని వాళ్ళకుచెప్పు. నేనొక హోటల్లోదిగాను భోజనం గదిలోకే వస్తుంది. నేను టాక్సీలో ఇక్కడికివచ్చాను. మనం నీ విద్యార్థులకి మాటచెప్పేసి గదికి వెళ్దాంరా. అన్నిసంగతులు వివరంగా మాట్లాడుకోవచ్చు. తలుపుకు తాళంవెయ్యి"

ఆమె తనదగ్గరఉండే చిన్నమ్మాయిని గదిముందర కూర్చోబెట్టి తండ్రితో బయలుదేరింది. కిందికిదిగగానే అయ్యంగారికిచెప్పి కార్లోకూర్చుంది.

రూమ్‌కి వెళ్ళగానే బెల్ కొట్టి ఇద్దరికీ భోజనం తెప్పించాడుతండ్రి. భోజనా లయిన తరువాత తీరికగాకూర్చుని "ఏంజరిగిందమ్మా? నీవు అతడితో అమెరికాకు వెళ్ళలేదా? లేక వెళ్ళి మళ్ళీ ఈ దేశానికివచ్చావా?" ఆమె తలమీద చెయ్యేసి అడిగాడు.

"ఓ అదా నాన్నా? అదొక మాయదారివల. దానిలో అందరం సంబరంతో పడ్డాం."

"అదేమిటి? లక్షణంగా ఏమీకొదువలేకుండా ఒక్కపిల్లకదాఅని పెళ్ళిచేశాం కాని-వల అంటున్నావేమిటి?"

"చెప్పమన్నావా? బొంబాయిలో విమానందిగిన తరువాత అమెరికాకు మరు నాడు ఉదయంకాని విమానంలేదన్నారు. అందుకని ఆ రాత్రి హోటల్లో ఒక గది తీసుకున్నాం. మా యిద్దరికీ చెరొక సూట్‌కేసు, ఆయనదొక బ్రీఫ్‌కేసూ వరసగా పెట్టాము. గదికి తాళంవేసి భోజనంచేసివచ్చాం. అప్పుడు ఆయన అన్నాడుకదా "నాకు టికెట్ ఉంది నీకు లేదు" అని.

"అమ్మ టికెట్‌కి డబ్బిచ్చిందికదా?" అన్నాను.

"టికెట్ ఈ దేశంలోమాదిరి డబ్బివ్వగానే ఇవ్వరు. మనిద్దరికీ పెళ్ళి అయినట్టు పెళ్ళిఫొటో, పెళ్ళిని రిజిస్టరుచేసిన సర్టిఫికెట్‌కూడా ఉండాలి. నీవు నాభార్యవని నిన్ను నాతో తీసుకువెళ్ళటానికి ఆధారాలుకావాలి. నిన్ను పోషించ గలనాలేదా అన్న ప్రశ్నకు నాజీతంఎంతో చెప్పాలి. నేను అక్కడికి వెళ్ళిన తరువాత నాకింతజీతమని నేను నాభార్యను పోషించగలననీ కనుక ఆమెను స్పాన్సరు చేస్తున్నాననీ ఇక్కడి ఆఫీసుకు రాయాలి. ఇక్కడి అధికారులుకూడా అంగీకరిస్తే నీకు, టికెట్ కొనుక్కునే పర్మిషన్ ఇస్తారు. అప్పుడు నీవు రాగలుగుతావు. అదికూడా కొందరికి అతికష్టమ్మీద లభిస్తుందివీసా. దీనికి కొన్ని నెలలుగాని ఏడాదిగాని పట్టవచ్చు. అయినా నేను డబ్బుతీసుకుని అధికారులతో మాట్లాడి ఏదోవిధంగా నచ్చచెప్పి టికెట్ కొంటాను. కొంచెం ఆలస్యమయినా భయపడకుండా ఉండగలవుకదా?" అడిగాడు.

గదితలుపు గడియవేసుకుని ఉంటాను చదువుకుంటూ. మీరు ఆలస్యం చేయ్యకుండా వేగిరరండి'' ఆయన పెట్టెతీసుకుని వెళ్తుంటే నేను వెనక్కుతిరిగి తలుపువేసుకున్నాను. రాత్రి పదకొండయినా ఆయనరాలేదు. వస్తే బెల్ కొడతారు కదా అని నేను మెలకువగానే ఉన్నాను. కాని ఎప్పుడో నిద్రపట్టింది. తెల్లవారినేను లేచేసరికి ఏడుగంటలయింది. ఇంకా రాలేదేమిటని తలుపుగడియ తియ్యబోతే తీసేఉంది. గతరాత్రి గదుల్లోఉన్నవాళ్ళు వెళ్ళిపోయారు. ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు, భయంపుట్టి, గదిలోఉన్న పెట్టెలవంక చూశాను. ఒక చిన్న బ్రీఫ్ కేసుంది. రెండు పెట్టెలూలేవు. పిలిచినా నేను లేవకపోతే ఆయన గదిలోకి ఎట్లా వస్తాడనిపించింది. ఏదయినా పెట్టి గడియతీశాడేమో? నాదొకటి తనదొకటి లేవక్కడ. ఆ ఉన్న పెట్టెను బలంగాలాగితే తాళం ఊడివచ్చింది అందులో పాత తువాలొకటీ, బనియన్ఒకటి ఉన్నాయి. పాకెట్లో కంపెనీపేరు మెకానిక్ అన్న కార్డు ఒకటి ఉంది. అప్పుడు నాగుండె పగిలిపోయిందనుకో. గబగబా కళ్ళు తుడుచుకుని అవతలగదిలో ఉన్న ఆయనను అడిగితే-అన్ని వివరాలూ ఆడిగి, ''నిన్ను ఆయన ఇక్కడ వదిలి పెట్టిపోవాలనే ఉద్దేశ్యంతో పెళ్ళిలో కట్నమడగ కుండా అన్నీ నీకు నగలు పెట్టమన్నాడు. పెళ్ళిలో పెట్టిన చీరెలు నగలూ అక్కడ అమ్ముకుంటాడు. నీవిక్కడే ఉంటావు. నిజంగా తీసుకువెళ్ళటం అంత సులభంకాదు. వీసా రావటానికే చాలారోజులు పడుతుంది. అందులో మెకా నిక్కంటున్నావు. ఆయన జీతానికి వీసారాదు. జీతం చూస్తారు-ఇద్దరు జీవించ గలరా ఆజీతంలోన నీకు వీసా ఇవ్వరు. ఆ పెట్టెలో ఉన్నవన్ని అమ్ముకుంటాడు. అయినా అతడు అమెరికాలో ఉండేవాడవునో కాదో? మీకు తెలియని సంబంధ మంటున్నావు. ఎవరో మధ్యవర్తి కుదిర్చాడంటున్నావు. ఈ మధ్య ఇటువంటి కేసులు చాలా వింటున్నాము. మొన్ననే ఒకకేసు విన్నాము. తను పెద్ద ఇంజ నీయరునని ఒక పట్టభద్రను పెళ్ళిచేసుకుని ఆమెకు ఒక ఏడాది వరకే వీసా తీసుకుని వెంట తీసుకువెళ్ళాడట ఒక పెద్ద మనిషి, ఒక ఇల్లు తీసుకుని ఇద్దరూ ఉంటున్నారు ఆతడొక మెకానిక్ట కొన్ని నెలలు మాట్లాడకుండా ఉన్నట్టే ఉండి ''డబ్బులేదు. నీవస్తువులిమ్మని వేధించేవాడట. ఆమెలో తప్పులెన్నటమే పనిగా పెట్టుకుని చాలా బాధించేవాడట. ఒక ఐదారునెలలయిన తరువాత ఆమెకు చెప్పకుండా వెళ్ళిపోయాటడ. ఆమె కొన్నాళ్ళు, వస్తాడని వేచి చూసిందట. అతడు రాకపోయేసరికి ఇరుగుపొరుగులతో చెప్పకుని ఏడ్చిందట. ఆ దేశంలో ఆమెను

ఆ విధంగా డబ్బులేనిదానిగాచేసి వదలిపెట్టిన ఆ పెద్దమనిషిమీద ఏ విధమైన చర్య తీసుకోగలదు?

అందరినీ అడగగా ఇటువంటివారిపైన చర్యతీసుకోటానికి ఇండియానుంచి వచ్చిన ఆమె అక్కడ న్యాయశాస్త్రంచదివి ఇటువంటి వనితలను ఆదుకొంటున్నదట. ఆమె ఎడ్రసుఇచ్చి, ఇరుగుపొరుగులందరూ ఆమె దగ్గరికి పంపించారట. ఆకేసును ఆమె చేపట్టి కొంత ఆలస్యమైనా అతడిని వెతికి శిక్షింపచేసిందట. విడాకులిప్పించి అమ్మాయికేదో జీవనోపాధి చూపించిందట.''

"అమ్మాయీ, నీచేతిలో డబ్బుఉంటే ఇంటికి తిరిగివెళ్ళు. నీ తల్లిదండ్రులు చాలా బాధపడతారని" చెప్పాడు ఆయన ఆమె బాధచూడలేక.

"ఆ మంచిమాటలకే ఊరడిల్లి, నేను ఆ హోటల్నించి బయటికి వచ్చి కొంతదూరం నడిచి ఒకటాక్సీ తీసుకుని బొంబాయిస్టేషన్‌కి వచ్చాను. ఎక్కడికి టికెట్‌కొనాలాఅని ఆలోచించగా నాకు సంగీతం చెప్పిన రామానుజం అయ్యంగారు మనసులోమెదిలారు. ఆయన మదరాసు వెళ్ళేటప్పుడు ఇచ్చిన ఎడ్రసు నాపర్సులో ఉంది. ఆయన సలహామీదట సంగీతపాఠాలు చెప్పాలనుకున్నాను." అన్నది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

"అమ్మా, నీవు మనయింటికి రాలేకపోయావా? ఇక్కడికివచ్చి ఇబ్బంది పడ్డావెందుకు."

''నాన్నా, అంతడబ్బు ఖర్చుచేసి పెళ్ళిచేశావు. ఈ పెళ్ళి పర్యవసాన మిట్లా అయింది. నేను ఏ ముఖం పెట్టుకుని రాను మీదగ్గరికి? ఒకరిని మించి ఇంకొకరు బాగా గారాబంచేసి, పెంచి, నా వల్లనే సర్వనాశనమైపోయారు. 'మా అమ్మాయికి అమెరికా సంబంధంచేశా'మని ఎంతో సంతోషించారు. "ఆ సంతోషమే మీలో చివరివరకూ నిలిచిఉండనీ" అనుకున్నాను నాన్నా"

తల్లి ప్రశంసరాగానే వెక్కి వెక్కి ఏడ్చింది సీమంతిని.

"ఊరుకోమ్మా. నీ మాటలు వింటుంటే కడుపు చెరువయిపోతున్నది. కళ్ళు తుడుచుకో ముందు" అన్నాడు తండ్రి.

"నాన్నా పెళ్ళిచూపులకు ఏదో సామాన్యమైనచీరెను కట్టుకుంటే ఊరుకుందా

అమ్మ? జరీతో మెరిసిపోయే పట్టుచీరెను కట్టించింది. రవ్వల నెక్లెసు పెట్టింది. మెడనిండా చంద్రహారంవేసింది. చేతులనిండా గాజులువేసి మధ్యలో రవ్వలు తాపినగాజులు జిగజిగ మెరిసిపోయేవి వేసింది. అవే దీనికంతకు మూలకారణం. వాడికి కళ్ళుకుట్టాయి. ఇక-పెళ్ళి ఎంత అట్టహాసంగాచేశావు? ఆ దృశ్యం ఇంకా కళ్ళల్లో మెదులుతూ భగ్గున మండిస్తున్నది."

''అమ్మా! కూతురిపెళ్ళి అట్టహాసంగా చెయ్యాలని ఎవరికుండదు చెప్పు? పిల్లవాడినిచూసి ఉద్యోగాన్నిచూసి భ్రమిసిపోయాం. గోదావరి డెల్టాభూములు ఉన్నాయంటే ఇటువంటి సంబంధం ఇంకెక్కడా దొరకదనుకున్నాము. పాల కొల్లులో మేడ, కొట్లు ఉన్నాయంటే ఈ సంబంధాన్ని ఇంకెవరూ కుదుర్చు కుంటారోనని ఆరాటపడ్డాం. ఆలస్యంచేస్తే సంబంధం చెయ్యిజారిపోతుందనుకున్నాం "కట్నంవద్దు మీరివ్వదలచుకున్నది మీ అమ్మాయికివ్వండంటే ఎంత సంస్కారం కలవాడోనని పొంగిపోయాం. అందులోనూ అమ్మాయికి తగిన అందగాడని మురిసి పోయాం. అమ్మా, ఇవన్నీ తల్లితండ్రుల ఆశలూ కోరికలూను. కాదనగలమా తల్లీ?"

కళ్ళు తుడుచుకుంటూ "అందుకేనా అంత బ్రహ్మాండంగా పెళ్ళిచేశావు? ఆ మంగళసూత్రాలేం చేసుకోను? వచ్చేటప్పుడు నెల్లూరులో పెన్నలో పడేశాను. ఇంత సర్వనాశనం చేసినవి మనకెందుకు నాన్నా? అసలు మీరు అమెరికా సంబంధమని వ్యామోహపడ్డారుకదూ?''

''ఏమన్నా అనుకోఅమ్మా. మా ఆశాసౌధాలన్నీ కూలిపోయాయి. అయిందేదో అయింది. నీవింటికి రామ్మా" చేతులుపట్టుకుని బ్రతిమిలాడాడు.

''నేను మళ్ళీ మీ దగ్గరికి రాగలనా? ఆడూళ్లో నేను తల ఎత్తుకుని తిరగ గలనా? అప్పుడు నిర్ధనుడై, నిరాశ్రయుడై మన యింట్లో ఒక గదిలో ఉంటూ నాకు సంగీతం నేర్పిన అయ్యంగారింటికి నా దగ్గరున్న ఎడ్రసు ఆధారంగా ఇక్కడికివచ్చి, ఆయన కాళ్ళమీద పడ్డాను.

"ఏం తల్లీ? ఇట్లా వస్తివి?" అన్నారాయన.

రాబోతున్న ఏడుపునాపుకుంటూ ''మీ దగ్గరసంగీతం పరిపూర్ణంగా అభ్య సించాలని వచ్చాను మాస్టారూ" అన్నాను. నాన్నకు ఉత్తరం రాయకండి. మీ యింట్లోనే ఒక గదిలో ఉంటాను. పిల్లలకు విద్యనేర్పుతాను ట్యూషన్లు కుదర్చండి' అన్నాను.

ఆయన కొంతసేపాలోచించి. ఏదో గ్రహించినట్టుగా "బేబీ! ఇవాళరెస్టు తీసుకో. రేపటినుంచీ చూస్తాను. నీవు మా యింట్లోనే భోజనంచెయ్యి'' అన్నారు. ఆయన నాకు గురువులు. ఆయన మాటకెదురు చెప్పకుండా వాళ్ళ యింట్లో వారం రోజులు భోజనంచేశాను. ఆయన పదిమంది పిల్లలకు డాన్సు చెప్పమన్నారు ముందు. ఒక్కొక్కరు అరవైరూపాయలు ఇవ్వాలని మాట్లాడారు. "ఇప్పుడు ప్రారంభదశ కనుక అరవైరూపాయలు తరువాత పెంచాలి" అన్నారు. రేడియో టి. వి ప్రోగ్రాములు వారే ఇప్పిస్తున్నారు. వారికి మనంచేసిన సహాయంకంటే నాకు అధికంగా చేస్తున్నారు. నాకు టీ. వీ ప్రోగ్రాం ఇప్పించినప్పుడు వారికి జరీఅంచు ధోవతులనుకొని గురుదక్షిణ సమర్పించాను. నాన్నా, నేనిక్కడ గౌరవంగా బ్రతుకు తున్నాను'' అన్నది.

"సీమా, నీకు పట్టుమని ఇరవై ఏళ్ళులేవు. ఇదే జీవితమనుకోకు. నీవు ఇంటికి వస్తే అమ్మ సంతోషిస్తుంది. అన్నం నీళ్ళులేక మంచమెక్కింది. నా దుఃఖాన్ని కడుపులో దాచుకుని నేనామెను ఊరడిస్తున్నాను. నా మాటవినుతల్లీ" ఆమె ముఖం చేతుల్లోకి తీసుకుని బ్రతిమిలాడాడు.

"నాన్నా! ఆ మాట మాత్రం నన్నడగకండి. మీరు వ్యాపారాన్ని అక్కడి నుంచి ఇక్కడికి క్రమంగా తరలించండి. సెంటర్లో ఒక మేడకొనండి. మీ వృత్తి మీది. నా వృత్తినాది. రోజు మిమ్మల్ని చూస్తూఉంటాను. నేను ఇంక మీ దగ్గర ఉండను. మిమ్మల్ని సర్వనాశనం చేశానని క్షణక్షణమూ గుండె పిండేస్తున్నది. ఇప్పుడు జరిగినదంతా మర్చిపోవటానికి ప్రయత్నిస్తున్నాను. నాకు ఈ అవకాశం ఇవ్వండి" తండ్రి చేతులు తన చేతుల్లోకి తీసుకుని నుదుటి కానించుకున్నది"

భీష్మనారాయణవర్మ ఆమె చెప్పినట్టుగా బ్రోకర్లద్వారా ఒక మేడను మైలాపూర్‌లో కొన్నాడు. వారం రోజుల లోపల కాపురాన్ని తరలించుకొచ్చాడు. ఊళ్ళోఉన్న ఇంటిని అద్దెకిచ్చి వ్యాపారాన్ని మెల్లగా తరలించటం మొదలు పెట్టాడు.

సీమకు శిష్యురాండ్ర సంఖ్య అధికంచేసినందువల్ల తీరికలేకుండాపోయింది. పెద్దయింటిని అద్దెకు తీసుకుని ఒకగదిలో తానుండి మిగతా ఇల్లంతా సంగీత పాఠాలకు వాడుకుంటుంది. ఇప్పుడిప్పుడు డాన్సు కూడా ఎక్కువమంది పిల్లలకు నేర్పుతున్నది. ఆదాయం కూడా పెరుగుతోంది.

ఇదివరలో సీమంతినిని చూసినవాళ్ళు ఇప్పుడామెను గుర్తుపట్టలేరు.

అదిగో, అప్పుడే తన కేసువంటిదే ఒకటి హిందూపేపర్లో వచ్చింది. అప్పటికి అతడు నలుగురిని మోసంచేసి నగలూ డబ్బూ తీసుకుని ఇండియాలోనే తిరుగుతున్నాడట. కొత్తగా మరొకటి చెయ్యబోతే ఎదురుతిరిగింది పరిస్థితి. పోలీసులకు పట్టుపడ్డాడు. అతడిని చూడటానికి భీష్మనారాయణవర్మ జైలుకి వెళ్ళి చూశాడు. అతడే! అతడే తన కూతుర్ని మోసంచేసి జీవితాన్ని దుఃఖసాగరంలో ముంచాడు. ఆఫీసురూంలోకి వచ్చి "మీరు మీకస్టడీలో ఉంచిన అతడే మా అమ్మాయిని కూడా మోసగించాడు. అల్లారు ముద్దుగా పెరిగిన నా బిడ్డ ఇప్పుడు విరాగి అయిపోయింది. వాడు కసాయివాడు" అన్నాడు తడి కళ్ళతో. "మేమన్నీ ఇన్వెస్టిగేటు చేస్తున్నాం సర్. ఇంకా అతడినిగురించి రిపోర్టులు వస్తున్నాయి. కాని, కేసులన్నీ కోర్టులో విచారణకొచ్చేసరికి అతడు బతకడు, బ్లడ్ కేన్సరు. రక్తం కక్కుకుంటాడు అప్పుడప్పుడు" అన్నాడు.

ఏమీ మాట్లాడలేక భీష్మనారాయణవర్మ ఇంటికి వచ్చాడు. ఆయన కూతుర్ని చూసి తల్లిపడిన వేదనను మరిచిపోలేకుండా ఉన్నాడు.

వారంరోజులపాటు పట్టుబడిన అతడి కబుర్లే చెప్పుతూ భార్యనూరడించాడు. ఆమె ఇంకా ఒక్కొక్కటీ తలుచుకుని క్రుంగిపోతున్నది.

ఒకరోజు సీమంతినికి ఒక టెలిగ్రామ్ వచ్చింది. అది చూసిన ఆమెముఖం వికసించింది. అతడే తనకు బొంబాయిస్టేషన్లో బల్లమీద కూర్చుని కన్నీరుకారుస్తుంటే కబుర్లలోపెట్టి కాఫీ తెప్పించి యిచ్చాడు. అప్పటివరకూ ఆమె శోషపోయినట్టుగా ఉంది అతడే ఆమెను కబుర్లలోపెట్టి జరిగినదంతా చెప్పించాడు. 'అతడిమీద నేను కంప్లైంటు ఇచ్చాను అదివరకే. అంతటి మోసగాడయినా స్త్రీలజోలికిపోడు. వాళ్ళ దగ్గరున్నది తీసుకుని అట్లా వదలిపెట్టిపోతాడు" అన్నాడు. తెల్లవారితేగాని అతడికి ఢిల్లీపోయే రైలులేదు. అప్పటివరకూ తన సంగతంతాచెప్పాడు. కొదువలు ఆమెనే చెప్పమన్నాడు.

మదరాసులో ఒక కంపెనీలో తను పనిచేస్తున్నాడట. వాళ్ళు తనను అమెరికా పంపిస్తున్నారట రెండేళ్ళకు మాత్రమే. ఒకవేళ పొడిగిస్తే పొగిడించవచ్చునట. వచ్చిన తరువాత తనకు నచ్చిన అమ్మాయిని పెళ్ళిచేసుకుంటాడట.

తనెప్పుడు వచ్చినా ఢిల్లీనుంచి టెలిగ్రామ్ యిస్తాడట. సీమ వచ్చి తనను రిసీవ్ చేసుకోవాలట. తన పేరు దివాకరట.

అదంతా జ్ఞాపకం వచ్చింది సీమకు.

తను ఏ చీరె కట్టుకుని అప్పుడు స్టేషన్‌లో బెంచీమీద కూర్చుందో ఆ చీరే కట్టుకుని వెళ్ళింది స్టేషన్‌కి. అప్పటికింకా రైలువచ్చే వేళకాలేదు. అప్పుడు కూర్చున్నట్టే బెంచీమీద కూర్చుంది, దిక్కులు చూస్తూ.

రైలు ఎప్పుడో వచ్చింది దిక్కులు దద్దరిల్లే కూతలేస్తూ. ఆగంగానే ప్రయాణీకులు గబగబా దిగారు. గుంపులు గుంపులుగా బైటికి వెళ్తున్నారు.

సీమ దిగ్గున లేచిందిగాని ఆ గుంపులో ఎక్కడని వెతుకుతుంది? పెద్ద కళ్ళు చేసుకుని చూస్తోంది అతడికోసం.

కొంతసేపటికి హలో సీమా! అన్న పిలుపు వినబడి ఇటూ అటూ చూస్తోంది. దివాకర్ వచ్చి ఎదురుగా నిలబడి "సీమా, నేను వచ్చేశాను. అట్లా చూస్తావేం నన్ను మర్చిపోయినట్టుగా! నేను చెప్పిన పాఠాలు మర్చిపోయావా? పద పోదాం?" అన్నాడు.

"ఎక్కడికి?"

"హోటల్‌కిపోయి కాస్త కడుపునింపుకుని నిన్ను దింపి రేపుపొద్దున ఎనిమిది గంటలకు నిన్ను కలుస్తాను మళ్ళీ.

"ఎక్కడ?"

"నాకంతా తెలుసులేవోయ్. ఆ రామానుజం అయ్యంగారి శిష్యుడిని నేను. నాకు ఆయన ఉత్తరాలు రాస్తూ ఉంటారు. నీవెక్కడుంటున్నావో తెలిపారు."

"నేనెక్కడున్నదీ తెలుసుకోవటానికి సి.ఐ.డీ లను పెట్టారన్నమాట."

"అవును, మన వస్తువులను మనం జాగ్రత్త చేసుకోవద్దూ? గుండెలో పెట్టుకుని కాపాడాలి" అన్నాడు ఓరకంటితో చూస్తూ.

"మీరన్న హోటలు కాదుగాని ముందు మావాళ్ళింటికి వెళ్దాం. మా నాన్నా అమ్మా ఇప్పుడు ఇక్కడే ఉంటున్నారు మైలాపూర్‌లో. అక్కడ మిమ్మల్ని పరి

చయం చేసి వాళ్ళకు, కాఫీ టిఫిన్ ఇప్పిస్తాను. మానాన్నతో కొంచెం సేపు మాట్లాడుతూ ఉండండి. ఇంతలోకి మా అమ్మను లోపల్నించి తీసుకువస్తాను. అందరూ మాట్లాడుతూ కూర్చుంటే టిఫిన్ డ్రింక్సూ నేనే తీసుకువస్తాను"

"ఓ.కే" అన్నాడు.

వాళ్ళయింటికి వెళ్ళగానే "నాన్నా, ఈయనే బొంబాయి రైల్వేస్టేషన్‌లో బెంచీమీద నేను శోషపోయినట్టు కనబడగానే కాఫీ తెప్పించి గొంతులోపోసి సేద దీర్చినాయన. ఈ ఊళ్ళోనే ఒక కంపెనీలో పనిచేస్తారు. కంపెనీ వాళ్ళే విదేశాలకు పంపించారు. అప్పటికి ఇప్పుడు స్వస్థలం చేరుకున్నారు. మీరు మాట్లాడుతూ ఉండండి, నేను టిఫిన్ అవీ తీసుకువస్తాను" అంటూ వెళ్ళింది.

భీష్మనారాయణవర్మ అతడి పుట్టుపూర్వోత్తరాలన్నీ అడిగాడు. అతడికి తల్లిదండ్రులు లేరట. ఒక చెల్లెలుందట ఢిల్లీలో, పెళ్ళి అయిందట. సెలవుల్లో భర్తతో కూడా అన్నదగ్గరకు వస్తుందట. అతడికి కంపెనీవారిచ్చిన ఇల్లున్నదట. ఒక కారుందట. ఇంక ముందు పెళ్ళిసంగతి ఆలోచిస్తాడట.

ఇదీ జరిగిన సంగతి సీమ కాఫీ టిఫిన్లు తెచ్చేసరికి.

ఆమె అందరికీ ప్లేటందించింది. వాళ్ళు తీసుకుంటూ ఉండగా మరొకరకం స్వీట్ తెచ్చింది.

సీమ తల్లిదండ్రులిద్దరూ అతడిని చూడగానే మొదట విదేశీయుడనుకున్నారట. కాని పేరు విన్నతరువాత, అతడు స్వచ్ఛమైన ఉచ్చారణతో తెలుగుభాష మాట్లాడుతూఉంటే ఆశ్చర్యంతో వింటూ అంతలో ముఖాలు చిన్నబుచ్చుకున్నారు. వాళ్ళకేమాశలు పొటమరించాయో ఏవి తలుచుకుని ఖిన్నులయారోమరి.

సీమ "మీ యింట్లో దింపుతాను రండి'' అంది. అతడు లేచినిలబడి ఆయనకు నమస్కారంచేసి కదలబోతూ.

''ఏమండీ! మీరంతా మాయింటికి రేపు భోజనానికి రండి. నాదగ్గర మంచి వంటవాడున్నాడు. అందరం కలిసి భోజనం చేద్దాం. నేను కారు తీసుకువస్తాను" అన్నాడు దివాకర్.

"మీరు కంపెనీకి వెళ్ళరా?"

"నాకింకా వారంరోజులు జాయినింగ్ టైముంది. ఈలోపల కొన్ని యింటి పనులు చేసుకుంటాను. ఎన్నాళ్ళో అయింది కదా తాళంపెట్టి" అన్నాడు.

"పోనీ, ఇల్లు సర్దుకుని మీపనులు చూసుకున్న తరువాతనే మేము వస్తాము" అన్నాడు భీష్మనారాయణవర్మ.

"అలా కాదు. మీతో ముందు భోజనంచేసిన తరువాతనే ఇల్లు సర్దుకుని కాస్త రంగులూ అవీ వేయించి పెద్ద పార్టీ యిస్తాను. అప్పుడు మీరు రావలసే ఉంటుంది" అన్నాడు.

మరునాడు వాళ్ళయింటికి సీమ తీసుకువెళ్ళింది. కబుర్లు చెప్పుకుంటూ సంతోషంగా అందరూ భోజనాలు చేశారు.

"హాల్లోకూర్చుని తాంబూలం సేవిస్తూ "ఆ ఫొటోలెవరివి ? జరీదండలు వేశారు?" అడిగాడు భీష్మనారాయణవర్మ.

"అవి మా తల్లిదండ్రులవి. నాకు ఎంతో ఖర్చుపెట్టి చదువు చెప్పించారు. ప్రతిరోజూ నేను స్నానంచేసి పాతదండలు తీసి కొత్తవి వేస్తాను. అవి వేసిగానీ నేను కాఫీ తాగను. నన్ను ఏదురలవాటూ లేకుండా తీర్చిదిద్దిన పుణ్యమూర్తులు. రాత్రిళ్ళు వాళ్ళను తలచుకుంటూ నిద్రపోతాను" అన్నాడు.

దివాకర్ యింటినుంచి వచ్చిన తరువాత భీష్మనారాయణవర్మ మనసు తేలికపడినట్లయింది. విశాలమ్మ అలాంటి అల్లుడు వస్తే బాగుండేదనుకుంది. ఆ అదృష్టం తనకు పట్టలేదని కొంచెము చిన్నబోయింది.

అతడికి జాయినింగ్ టైమ్ ఇంకా రెండురోజులుందనగా ఒకరోజు సీమ దివాకర్ కొత్తబట్టలు ధరించి పూలహారాలతో భీష్మనారాయణ ఇంటికి వచ్చి, పాదాభివందనం చేశారు దంపతులకు.

భీష్మనారాయణవర్మ మొదట ఆశ్చర్యపడి "ఇద్దరూ మంచిపని చేశారు. మా చేతలూ ఆలోచనలూ అచ్చిరాలేదు" అని ఇద్దరినీ దీవించి చెరొకపండు చేతుల్లో పెట్టాడు.

"మరి, మీరిద్దరూ సాయంత్రము పార్టీకి రావాలి చాలామంది వస్తారు. మీరు ముందుగా రావాలి. ఇది నా ప్రార్థన" అన్నాడు దివాకర్.

''అలాగే నాయనా" అన్నారిద్దరూ.

సాయంత్రం వాళ్ళు రాగానే దివాకర్ కొత్తబట్టలిచ్చి వీటిని ధరించిన తరువాత దీవించండి. ఇప్పుడే కాదు'' అన్నాడు.

చీరంతా జరీతో మిలమిల మెరిసిపోయే బట్టలు సీమ కందించి, ఈ నగలు మా తల్లివి, కోడలికి ఇవ్వమని చెప్పింది. డ్రెస్‌చేసుకుని రా'' అన్నాడు.

సీమ ఆ జరీబట్టలతో ధగధగలాడే నగలతో తలలో పూలు పెట్టుకుని తల్లిదండ్రులకూ అత్తమామల ఫొటోలకూ నమస్కరించింది.

"ఇంక ఆహూతులందరూ వచ్చేవేళయింది. షామియానాలోకి వెళ్దాంరండి" అని తీసుకువెళ్ళి పెద్దవాళ్ళ నిద్దరినీ ఒక సోఫాలో కూర్చోబెట్టాడు.

దివాకర్ కంపెనీ వాళ్ళూ అతడి స్నేహితులూ రామానుజం అయ్యంగారి దంపతులూ అందరూవచ్చి విందారగించి వాళ్ళకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంకా అతిధులందరూ వెళ్ళకముందే పోలీసాఫీసరు టెలిఫోను చేశాడు. సీమకు గుండెలదరిపోయాయి.

దివాకర్ ఏమిసంగతి అనగానే "నేను మీవిందుకు రాలేకపోయాను. ఆ నేరస్థుడు రక్తం కక్కుకుని చనిపోయాడు. పై ఆఫీసర్లకు తెలిపి ఏం చేయాలో చెప్పమని అడగటంతో టైమయిపోయింది. క్షమించాలి" అన్నాడు.

"అయితే రేపురండి. అతిధులు కొందరింకా ఇక్కడే ఉంటారు. తప్పకుండా రండి" ఫోను పెట్టేశాడు.

పోలీసాఫీసరు మళ్ళీ ఫోనెత్తి.

''అతిధులను ఇంట్లోనే ఉంచుకుంటారా ?''

''ఆఁ, ఉండేవాళ్ళే అతిథులుగా వచ్చారు పార్టీకి."

"ఓ.కే. తప్పకుండా వస్తాను ఇదేవేళకు. ఇంకా నా మాదిరిగా మిగిలిపోయిన వాళ్ళు కూడా వస్తారా ?''

''ఇంకెవరు లేరు. మీరే మిగిలిపోయారు. తప్పకుండా వేళకు రండి, మా

యిల్లు చూద్దురుగాని. కొత్తగా రంగులు వేయించాను. మామిడాకు తోరణాలు కట్టించాను."

"ఆఁ హాఁ, అయితే తప్పకుండా మోయలేనన్ని శుభాకాంక్షలూ ప్రెజంటేషన్సూ తెస్తాను. ప్రస్తుతానికి విష్ యూ అల్ ది బెస్టు. రేపింకా మరికొన్ని. ఉంటాను" ఫోను పెట్టేశాడు.